***గీతాంజలి మూర్తి,*** జి. 123, మధురానగర్,

(ఏం వి ఎల్ ఎన్ మూర్తి, ) హైదరాబాద్, 500038

------------------------టెలి.040-23739500, మొ.9849062885, **eMail:** gitanjalimurty@gmail.com---

***నవరస కవితా ఝరి, సోదరి, శ్యామల గారికి,*** 9.2.2012

***తేనెకంటే తియ్యన, వెన్న కంటే మెత్తన,***

***వెన్నెల కంటే చల్లన, మల్లెకంటే తెల్లన, -----మీ గజల్ రచన.***

మీ రచన: ***గజల్లు కదలించిన మెదళ్ళు***

ఈ నెల 6వ తేది, సూర్య పత్రికలో, మీ **'కవికలం'నుంచిj** జనించిన రచన, నయాగరా జలపాతం లాగా గజల్ల అంబరాన్నుంచి, భువికి దూసుకొచ్చింది. చదివి చాలా ఆనందించాను. మీరు ఎన్నో విశేషాలు తెలియచేశారు. గజల్ అంటే తెలియని మాబోటి వారికికూడా, వివరంగా, అందులోని సరస సమ్మోహన రసాన్ని పిండిపోశారు.అందులోని, కొన్ని ముఖ్యమైన అంశాలగురించి నేను ప్రస్తావిస్తాను. (పునశ్చరణ అనుకోకుండా, మధురం ఎన్ని సార్లు రుచి చూసినా మదురమే కదా!, విశ్వనాధ వారి 'రామాయణ కల్పవృక్షం' లాగా, దీనికీ పునశ్చరణ దోషం అంటదు లెండి - ***'మధురం మధురం వదనం మధురం వచనం మధురం ..మధురాధిపతే, సకలం మధురం..' అన్నట్లు,*** .

కవితా ప్రక్రియలలో 'గజల్' ఎంత విశిష్టమైన స్థానం పొందిందో ఎంతో హృద్యంగా చెప్పారు: ఒక్క వాక్యంలో **'(భావ) బిందువులో సింధువును దాచుకున్న 'గజల్'**. దీనిలో మహా సముద్రమంత గంభీర భావం ఇమిడి ఉంది. చిన్న చేదు మాత్ర, పోయే *ప్రాణాన్ని కాపాడిన అమృత గుళిక వలె, గజల్ గురించి,* రసరాజు అంటాడు: ***ఒక్క గజల్ రాయాలని ఎంత చచ్చి బతికానో, ఓహ్ !*** *గజల్ కి ఇంద్ర ధనుస్సు వలె ఎన్ని అందమైన రంగుల నిర్వచనాలు అందించారు మీరు:* ***'తఘ్జల్'*** *అనే అరబ్బీ పదమే' ' గజల్' గా మారిందని చెప్తారనీ,* **'వేటగాని బాణపు గురిని తప్పించుకోవటానికి పరుగుపెడుతున్న లేడిపిల్ల పొదలలో చిక్కుపడి ఇక తప్పించుకునే దారిలేక చివరిగా చేసే ఆర్తనాదమే 'గజల్'** అని అంటారనీ, చక్కటి అర్ధం అందించారు. దాశరధి 1966లో, తెలుగులో రచించిన తొలి గజల్ మాట్లా ఇది: -' ***రమ్మంటే చాలుగానీ రాజ్యాలు విడిచిరానా! నీ చిన్ని నవ్వు కోసం స్వర్గాలు గడిచిరానా*** !!" ఓహ్ ! అద్భుతం !! ఇక్కడ నాకు ఒక కవిత గుర్తు వస్తోంది: ***' నీ నవ్వు లోనుంచి సిరిమల్లె రాలింది, మల్లె రాలిన చోట కళ్ళద్దుకున్నాను,,".*** ఇంతకు మించి ప్రేమాంకిత భావాలు, ఏముంటాయ్ !

ప్రసిద్ధ కవులు, గజల్ గురించి అన్నమాటలు, మళ్ళీ చెప్పుకుని మురిసి 'పొతే పోయేదేముంది', హృదయంలో మరొకమారు పులకరించటం తప్ప !'***గజల్ వ్రాయడమంటే రవ్వను చెక్కడం లాంటిది. బిందువులో సింధువుని కుదించడం లాంటిది', అని దాశరధి, 'సరసభావన, చమత్కార ఖేలన, ఇంపూ కుదింపు, గజల్ జీవ లక్షణాలు' అని సినారె,; ..... '....శ్రోతలను భావంబర వీధిలో విహరింపచేస్తూ పరవశింప జేసేది ఖసీదా కాదు , మస్నావీ కాదు, ఖవ్వాలి కాదు, సంజం కాదు, మరేమిటి, అంటే – ఖచ్చితంగా అది 'గజలే !" అని*** సదాశివ, **'గజల్ అంతగా సహృదయుల మనస్సులను సమ్మోహితం చేసిన కవితా రూపం మరొకటి లేదు'** అని నోముల సత్యనారాయణ, అన్నారు - అని మాలాంటి వారికి తెలియజేసినందుకు, మీకెలా ధన్యవాదాలు తెలుపాలో తెలియటం లేదు.

అంతేనా, గుంటూరు శేషేంద్ర శర్మ గజల్ గురించే చెప్పిన ప్రత్యక్షరసత్యం, పరమ సుందరం ! (ఆనందించాల్సిందే కదా !) ***"గజల్ చేతిలోకి వచ్చి వాలిన ఒక రంగు పక్షి, రెండు రెక్కలు, ఒక గొంతు, ఇంతే దాని సంపదంతా కలిపి ! ఎవరైనా ఒక పక్షిని చేత్తో***

*పట్టుకుంటే తెలుస్తుంది ! దాని పిడికెడు శరీరమంతా ఒక గుండె  అయి స్పందిస్తుంటుందని. దాని చంచల నేత్రాలు దిశలు చూస్తూ ఉంటాయి ! గజల్ అంత నాజుకు జీవి !  దాన్ని కన్నవాడు ఎంత దు:ఖం  మోసి కన్నాడో – మనసున్నవాడికే తెలుస్తుంది” –* **శరీరమంతా గుండె  కొట్టుకునే పెచ్చని ఆ పక్షి గుండె స్పందనే గజల్”** అన్న ఈ భావన  అద్భుతం !” ఇక్కడ **‘మనసున్న వాడికే తెలుస్తుంది’** అనటంలో ఒక నిత్య సత్యాన్నే చెప్పారు. అంతే కదా, అసలు మనసనేది లేని వాడికి, రసానుభూతి ఏముంటుంది ? అందుకే, ***రసో వై  స:  అన్నది శాస్త్రం.  భగవంతుడు రస – ఆనంద స్వరూపుడు. ఆ ఆనందాన్ని ఆస్వాదించాలంటే, మనసుండాలి, వాడే భగవంతునికి దగ్గిరగా అంటే  – ఆనంద స్వరూపానికి దగ్గిరగా ఉండగలడుదు.*** అదొక అదృష్టం అనుకోండి, మన లాగ !

ఇక్కడ మీ ‘గజల్’ సూత్రాలు స్పష్టంగా ఉన్నయ్:  ***‘అభివ్యక్తి లో బలం ఉండాలి. భావంలో ఔన్న త్యం ఉండాలి. పదాలలో లాలిత్యం ఉండాలి’.*** **(ఈ భావకుసుమాలన్నీ  మీ  భావన బృందావనంలో విరగబూయటం  చూసి, నేను మీరు వ్రాసిన** ***‘గుండె గుమ్మానికి పచ్చానాకువై’*** లో ఎన్నో ఏరుకున్నాను. ఈ దిశ లోదే, మీరుదహరించిన సురారం శకం  (శశాంకం)  (?) **‘సౌగంధిక’** లోని ‘మత్లా’ ఇది! ***‘ఒకే చూపు! వేల పున్నములు... ఎలా నిన్ను  చూసేది? ఒకే పాట ! వేల భావనలు ... ఎలా నిన్ను  పాడేది ?” ఓహ్ ఏం భావన, అద్భుతం !!***

ఇక తెలుగుకవులవద్దకు వస్తే, మీరు ఇచ్చిన సలహా సముచితంగా ఉండి.  పారశీ ఉర్దూ కవులు తమ గుండెను పిండి పెద్ద  చేసిన ఈ గజల్ పూదోట తెలుగు కవుల ఆదరణతో మరింత సరస సుందరారామంగా మారాలని, ప్రతిభావంతులైన తెలుగు కవులు మనసారా ఈ ప్రక్రియను చేపట్టాలన్నదే, మీ వ్యాసం ముఖ్యోద్దేశం, అని చేసిన మీ  సూచనను కవులు సాక్షరం చేస్తారని ఆశిస్తాను. అయితే, పరమ మామూలుగా రాసే కవులకు, ఒక చురక కూడా అంటించటం, నేను గమనించకపోలేదు. ***‘గుండె గాయం నుండీ పుట్టని గజల్లు మనసును కదిలించలేవనేది ప్రతి ఒక్కరూ అంగీకరించాల్సిన నిజం!’*** .  ఒక గాయకుడు, అది రాసిన కవి భావాన్ని అనుభూతితో అందించనపుడు, అతడెంత గొప్ప గాయకుడని పేరు గాంచినా, వాసనలేని పూవులాగా ఎలా స్పందనను కలిగించడో, ‘‘మనసును కదిలించని’ కవిత (గజలే  కానక్కరలేదనుకోండి,) కవితే  కాదు. ఇక్కడ **ప్రఖ్యాతి గాంచిన గురుదత్ చిత్రం “ ప్యాసా” తెలుగులో ‘మల్లెపువ్వు’** పేరుతో తీయబడిన, చిత్రంలో, తన కవిత ఎలా ఉంటుందో, ఆ కవి అంటాడిలా: ***‘ఎవరికి  తెలుసూ, చితికిన మనసూ, చితిగా రగులుననీ, ఆ చితి మంటల చిటపటలే, నాలో రగిలే  కవితలనీ....’*** .   అలా కదిలించినప్పుడే, ఆ కవిత ఇలా హృదయం మీద ముద్రపడి, చిరకాలం గుర్తుకు వస్తూ ఉంటుంది. అలా ఉండేవాటిల్లో, మీ కవితలు నాకు చాలా నచ్చినవని మరలా చెప్పనక్కరలేకపోయినా, అలా చెప్పకోవటం అలవాటయింది. .మధురం మధురం లాగా. !!

ఇలా మీ నుంచి మరిన్ని రసవత్తరమైనవి, భావస్ఫోరకమైనవి, ***“గుండెలో గూడెట్టి గువ్వ.. లా ...’*** పదిలంగా దాచుకోవలసిన భావతరంగాలు ఎగసి వస్తూనే ఉండాలనీ, మనసారా కోరుకుంటూ,

మీ కవితాభిమాని,

***గీతాంజలి మూర్తి.***

***సాహితీ మిత్రులకు ప్రతులు: శ్రీ***____________________________________